శనివారం 15-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 365, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## ఒకే వేదికపై 4,300 మందికి సీపీఆర్ శిక్షణ

వివరాలు 2లో




## చైనాలో మహిళా జర్నలిస్టుకు ఐదేళ్ల జైలు

వివరాలు 2లో



## ఆరేళ్ల బాలికను చిదిమేశాడు

వివరాలు 4లో



## BEST OF WEB GLAMOUR PICS


వివరాలు 5లో

# వెనక్కి తెప్పించిన 24 లక్షల పుస్తకాలు

### ముందు మాటలో తప్పులపై ప్రభుత్వం చర్యలు ■ ఇద్దరు అధికారులను తొలగిస్తూ ఆదేశాలు

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణలోని ప్రభుత్వ తెలుగు పాఠ్యపుస్తకం ముందు మాటలో తప్పులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ శ్రీనివాసచారి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రాధారెడ్డిపై చర్యలకు ఆదేశించింది. పాఠ్యపుస్తకాల బాధ్యతల నుంచి శ్రీనివాసచారి, రాధారెడ్డిని తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌గా పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ రమేశ్‌కు బాధ్యతలు అప్పగించారు.



తేది : 07/01/2023
స్థలం : హైదరాబాద్.
సంచాలకులు
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, తెలంగా

టీఆర్ఈఐఎస్ కార్యదర్శి రమణ కుమార్‌కి ముద్రణ సేవల విభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు కేటాయించారు. తెలంగాణలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసిన తెలుగు వాచకం పాఠ్య పుస్తకాలను వెనక్కి తీసుకోనున్నారు. పంపిణీ చేయని వాటిని పిల్లలకు ఇవ్వకుండా నిలిపివేశారు. 24 లక్షల పుస్తకాల్లోని ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు, అధికారుల పేర్లను ముద్రించారు. ఏళ్ల క్రితం నాటి ముందుమాటలో మార్పులు చేయకుండా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. బుధవారం పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న సమయంలో ముందుమాటలోని తప్పులను చాలాచోట్ల ఉపాధ్యాయులు గుర్తించి విద్యాశాఖ దృష్టికి తీసుకొచ్చారు.

తొలుత ఆ పేజీని చించేయాలని ఆదేశించిన అధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఆ పేజీని తొలిగిస్తే దాని వెనుకున్న వందేమాతరం, జాతీయ గీతం, ప్రతిజ్ఞ లేకుండా పోతాయి. అప్పుడు మరిన్ని విమర్శలు వస్తాయని భావించారు. దాంతో పిల్లలకిచ్చిన, ఇవ్వని పుస్తకాలన్నీ వెనక్కి తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన డీఈఓలను ఆదేశించారు. వాటిని మండల వనరుల కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఆ పేజీ మొత్తం కనిపించకుండా స్టిక్కర్ వేసి అందజేయనున్నారు. తెలుగు వర్క్ బుక్స్‌నూ వెనక్కి తీసుకుంటున్నారు.

## గుంతల రోడ్లపై ఎమ్మెల్యేపై ఆవేదన

### నితిన్ గడ్కరీకి సొంత పార్టీ ఎమ్మెల్యే ఫిర్యాదు




**ముందడుగు అస్సాం:**

రహదారి గుంతలమయంగా మారడంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సొంత పార్టీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. రోడ్డు బాగయ్యే వరకు టోల్ ట్యాక్స్ వసూళ్లను నిలిపివేయాలని కోరారు. అస్సాంలోని ఖుమ్తాయ్ అసెంబ్లీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే మృణాల్ సైకియా గురువారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని ఉద్దేశించి ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. గుంతలు, నీటితో అధ్వాన్నంగా ఉన్న రహదారి వీడియో క్లిప్‌ను షేర్ చేశారు. జాతీయ రహదారితో అనుసంధానించే రోడ్డు 37కు టోల్ వసూలు నిలిపివేయాలని అందులో కోరారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఈ పోస్ట్‌ను ట్యాగ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యే మృణాల్ సైకియా పోస్ట్‌పై కొందరు స్పందించారు. ప్రభుత్వం నుంచి ఒకరు ఈ సమస్యను ప్రస్తావించడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. 'రహదారి సమస్యపై ప్రభుత్వం నుంచి ఎవరో ఒకరు మాట్లాడటం మంచిదే. రహదారి పరిస్థితి మెరుగుపడే వరకు ఎన్‌హెచ్ 37 మొత్తాన్ని టోల్ ఫ్రీ చేయాలి. ఈ రోడ్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది' అని ఎక్స్‌లో ఒకరు పేర్కొన్నారు. అలాగే బీజేపీ ఎంపీగా గౌరవ్ గొగోయ్ విజయంపై అస్సాం వాసి విమర్శించగా అతడిపై కేసు నమోదైంది.


## ఇండియాకు చేరుకున్న కువైట్ మృతదేహాలు

### మృతుల్లో 45 మంది భారతీయులు

### ఆ 45 మందిలో కేరళకు చెందినవారు 12 మంది

**ముందడుగు జాతీయం:**

కువైట్ అగ్నిప్రమాదంలో మరణించిన భారత కార్మికుల మృతదేహాలు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానం శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని పాలం ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఈ తెల్లవారుజామున 4 గంటలకే కువైట్ నుంచి బయలుదేరిన విమానం ముందుగా ఉదయం 11 గంటలకు కేరళలోని కొచ్చి ఎయిర్‌పోర్టులో దిగింది. అక్కడ కేరళ, మిగతా 2లో



## ఢిల్లీని వణికించిన దుమ్ము తుఫాన్

వివరాలు 2లో

ముందడుగు
శనివారం,
15-6-2024,
హైదరాబాద్

## ఇండియాకు చేరుకున్న కువైట్ మృతదేహాలు

మొదటిపేజీ తరువాయి

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కార్మికుల మృతదేహాలను దించి.. మధ్యాహ్నం ఢిల్లీకి బయలు దేరింది. మిగిలిన మృతదేహాలతో సాయంత్రం ఢిల్లీలో దిగింది.

కువైట్ అగ్నిప్రమాదంలో మొత్తం 49 మంది కార్మికులు మరణించగా వారిలో 45 మంది భారతీయులు ఉన్నారు. ఆ 45 మందిలో కేరళకు చెందినవారు 12 మంది, తమిళనాడుకు చెందిన వారు ఏడుగురు, ఏపీకి చెందినవారు ముగ్గురు ఉన్నారు. మిగిలిన వారు వివిధ ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారు. విమానం రాకకుముందే పాలం విమానాశ్రయం వద్ద అధికారులు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అధికారులు మృతులకు ఎయిర్‌పోర్టులో నివాళులు అర్పించారు. అనంతరం మృతదేహాలను అంబులెన్సులలో స్వగ్రామాలకు తరలించారు.

కువైట్‌లోని మంగఫ్ సిటీలో బుధవారం ఉదయం 6 గంటలకు భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఎన్‌బీటీసీకి చెందిన 6 అంతస్తుల భవనంలో చెలరేగిన మంటల్లో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వంట గదిలో ప్రమాదం జరిగిందని, అనంతరం మంటలు వ్యాపించాయని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో పొగ పీల్చడంవల్ల పలువురు కార్మికులు ఊపిరాడక చనిపోయినట్టు తెలుస్తున్నది. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో దాదాపు 160 మంది కార్మికులు ఉన్నారు.

## చైనాలో మహిళా జర్నలిస్టుకు ఐదేళ్ల జైలు

### ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకే కేసు ▪మహిళా హక్కులపై విస్తృత ప్రచారం

**ముందడుగు చైనా:**




చైనా ప్రభుత్వంపై ధిక్కార స్వరం వినిపించే వ్యక్తులు, సంస్థలపై చైనా ఉక్కుపాదం మోపుతూనే ఉంది. ఈ క్రమంలో మీటూ ఉద్యమంలో భాగంగా మహిళా హక్కులపై విస్తృత ప్రచారం చేసిన ఓ మహిళా జర్నలిస్టుకు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అంతేకాకుండా లక్ష యువాన్ల (సుమారు రూ.11.5లక్షలు) జరిమానా వేసినట్లు సమాచారం. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడంతోపాటు అధికారాల అణచివేతను ప్రోత్సహిస్తున్నారనే అభియోగాలు మోపింది. ఈ కేసులో మహిళా జర్నలిస్టుతోపాటు మరో సామాజిక కార్యకర్తకు మూడున్నరేళ్లు శిక్ష విధించింది.


ప్రపంచవ్యాప్తంగా మీటూ ఉద్యమం కొనసాగిన వేళ.. చైనాలోనూ పలు కేసులు వెలుగు చూశాయి. ఆ దేశంలోనే ప్రముఖ యూనివర్సిటీలో పీహెచ్‌డీ సూపర్‌వైజర్.. లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఓ యువతి చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. వీటిని హువాంగ్ షియేకిన్ అనే ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ స్థానికంగా విస్తృత ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే ఆమెతో పాటు మరో సామాజిక వేత్త వాంగ్ జియాన్‌బింగ్‌లు సెప్టెంబర్ 2021 నుంచి కనిపించకుండా పోయారు. అప్పుడే చైనా అధికారులు వారిని అరెస్టు చేసినట్లు సమాచారం. కార్మిక హక్కులపై పోరాటం చేసే వాంగ్.. లైంగిక వేధింపులు ఎదుర్కొన్న ఎంతోమంది మహిళలకు బాసటగా నిలిచారు.

## ఢిల్లీని వణికించిన దుమ్ము తుఫాన్

- అస్తవ్యస్తంగా మారిన జనజీవనం
- వాహనదారులు తీవ్ర ఇబ్బందులు

**ముందడుగు ఢిల్లీ:**


దేశరాజధాని ఢిల్లీని శుక్రవారం సాయంత్రం దుమ్ము తుఫాన్ వణికించింది. సాయంత్రం 6 గంటలకు ఢిల్లీఎన్‌సిఆర్‌లో దుమ్ము తుఫాను కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లపై విజిబిలిటీ కూడా బాగా తగ్గిపోయింది. దీంతో ముందు ఏమీ కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఢిల్లీలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఇండియన్ మెటియోలాజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎండీ) అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఇది ఎన్‌సీఆర్‌లో మండుతున్న వేడితో బాధపడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఢిల్లీలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, మధ్యాహ్నం, సాయంత్రం కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 35 కిలోమీటర్ల వేగంతో వేడిగాలులు, బలమైన గాలులు వీస్తాయని తెలిపింది.



గత మే నెలలో కూడా ఢిల్లీని దుమ్ము తుఫాను చుట్టిముట్టింది. అప్పటికే అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన రాజధాని నగరం దుమ్ము తుఫానుతో భయాందోళనలు కలిగిస్తుంది. తీవ్రమైన దుమ్ము తుఫాను, బలమైన గాలులు దేశ రాజధానిని తాకడంతో ఢిల్లీ వాతావరణంలో పెను మార్పు సంభవించింది. దుమ్ము తుఫాను దేశరాజధాని ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాన్ని కుదిపేసింది. గతంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో జనజీవనం స్తంభించింది.


## ఒకే వేదికపై 4,300 మందికి సీపీఆర్ శిక్షణ

- జొమాటో డెలివరీ పార్టనర్స్‌కు ప్రథమ చికిత్స
- అరుదైన రికార్డ్ సొంతం చేసుకున్న జొమాటో



**ముందడుగు ముంబాయి:**

అత్యవసర సమయాల్లో ఉన్నవారికి వైద్య సాయం అందించేలా ప్రముఖ ఫుడ్ డెలివరీ కంపెనీ జొమాటో అరుదైన రికార్డ్ సొంతం చేసుకుంది. తమ డెలివరీ భాగస్వాములను తీర్చిదిద్దింది. ఒకే వేదికపై 4,300 మంది డెలివరీ పార్ట్‌నర్స్‌కు సీపీఆర్ శిక్షణ అందించి గిన్నిస్ రికార్డును కైవసం చేసుకుంది. ఈ విషయాన్ని జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ తెలిపారు. 'ముంబయిలో నిర్వహించిన ఓ వేదికలో ఏకంగా 4,300 మంది డెలివరీ పార్టనర్స్‌కు ప్రథమచికిత్స ఎలా అందించాలో నేర్పించాం. దీంతో గిన్నిస్ రికార్డ్ సొంతం చేసుకున్నాం. ప్రస్తుతం జొమాటోలో 30,000 కంటే ఎక్కువ డెలివరీ భాగస్వాములు వైద్యం అందించడానికి, రోడ్‌సైడ్ ఎమర్జెన్సీ సమయంలో సాయం అందించడానికి వృత్తిపరంగా శిక్షణ పొందారు'' అని గోయల్ ''ఎక్స్'' వేదికగా పేర్కొన్నారు. దేశంలోని ఎమర్జెన్సీ హీరోలకు సెల్యూట్ అంటూ ముంబయి ఈవెంట్‌కు సంబంధించిన ఫొటోలు జత చేశారు. తమ డెలివరీ భాగస్వాములు ప్రథమ చికిత్స, సీపీఆర్ అందించడానికి వృత్తిపరమైన శిక్షణ పొందినట్లు జొమాటో తన అధికారిక ''ఎక్స్'' ఖాతా ద్వారా పంచుకుంది. అంతేకాదు ఈ శిక్షణ తీసుకున్నవారి బ్యాగ్‌పై గ్రీన్ కలర్ ''+'' చిహ్నం ఉంటుందని పేర్కొంది. జొమాటో చేపట్టిన చర్యపై నెటిజన్లు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. 'చాలా గొప్ప ప్రయత్నం', 'ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నందుకు అభినందనలు', 'డెలివరీ పార్ట్‌నర్స్‌కు మీరు ఇచ్చిన శిక్షణ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.





## మీరు అలా చేస్తే యుద్ధం ఆపుదాం

### ఉక్రెయిన్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆఫర్

**ముందడుగు జాతీయం:**

కాల్పుల విరమణకు ఆదేశాలు ఇస్తాను అంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌కు ఆఫర్ ఇచ్చారు. అయితే అందుకు రెండు షరతులు విధించారు. రష్యా విదేశాంగ శాఖ కార్యాలయంలో పుతిన్ మాట్లాడుతూ.. ''మేం వెంటనే కాల్పుల విరమణ చేస్తాం'' అని అన్నారు. కాల్పుల విరమణకు ఆదేశాలతో పాటు చర్చలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. తమ స్వాధీనంలో ఉన్న నాలుగు ప్రాంతాల్లో బలగాలను ఉపసంహరించుకోవాలని, నాటోలో చేరాలన్న ఆలోచనను విరమించుకోవాలని కీవ్‌కు షరతు విధించారు. తుది పరిష్కారం కోసం ఈ ప్రతిపాదన తెచ్చినట్లు, ఎలాంటి ఆలస్యం లేకుండా చర్చలు ప్రారంభిస్తామని చెప్పారు. అయితే ఒకవైపు జీ7 దేశాలు ఇటలీలో సమావేశమైన తరుణంలో ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉక్రెయిన్‌కు చెందిన దొనెట్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, జపోరిజియా ప్రాంతాలు తమ దేశంలో విలీనమైనట్లు గతంలో రష్యా ప్రకటించింది. అయితే, ఈ చర్యను ఉక్రెయిన్, పశ్చిమదేశాలు ఖండించాయి. రష్యా దళాలు ఆక్రమించి విలీనం చేసుకున్న ఆ నాలుగు ప్రాంతాలతో పాటు 2014లో స్వాధీనం చేసుకున్న క్రిమియాను కూడా వదిలివెళ్లాలని ఉక్రెయిన్ డిమాండ్ చేస్తోంది. ప్రస్తుతం నాటోలో చేరే దిశగా అడుగులు వేస్తోన్న తరుణంలో... రష్యా ఇచ్చిన ఆఫర్ ఉక్రెయిన్‌కు రుచించకపోవచ్చు.

ముందడుగు
శనివారం,
15-6-2024,
హైదరాబాద్

# తీహార్ జైలులో కవితను కలిసిన కేటీఆర్

## ఆమె ఆరోగ్య పరిస్థితిపై వివరాలు సేకరణ



**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయినా బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కవిత తీహార్ జైలులో ఖైదీగా ఉన్నారు. జైల్లో ఉన్న కవితను శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమెను కలిసిన అనంతరం కేటీఆర్ హైదరాబాద్కు తిరుగు పయనం అయ్యారు. ఇటీవలే కవితకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మరో రెండు వారాల పాటు జ్యూడీషియల్ రిమాండ్ పొడిగించిన సంగతి తెలిసిందే. కవిత జూన్ 21వ తేదీ వరకు జైలులో రిమాండ్ లో ఉండనున్నారు. మరోవైపు కోర్టులో చదువుకోవడానికి ఆమె తొమ్మిది పుస్తకాలు కావాలని కోరగా.. కోర్టు అందుకు అంగీకరించింది. తదుపరి విచారణ ఈ నెల 21న జరుగనుంది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరపనుంది. అయితే కవితను బయటకు తీసుకురావడానికి ఆమె కుటుంబం ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే ఉంది.

# అయోధ్య రామ మందిరాన్ని కూల్చేస్తాం

## జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ హెచ్చరికలు

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామ మందిరాన్ని కూల్చేస్తామంటూ పాక్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ హెచ్చరించినట్లు ఓ ఆడియో సందేశం లీక్ అయ్యింది. రామ మందిరంపై బాంబులతో దాడి చేస్తామంటూ ఆ ఆడియోలో ఉన్నట్లు జాతీయ మీడియా తాజాగా వెల్లడించింది. జైషే సంస్థ హెచ్చరికలతో అయోధ్య పోలీసులు అప్రమత్తం అయ్యారు. రామాలయం పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.



మరోవైపు రామ మందిరానికి ఇలా బెదిరింపులు రావడం ఇది మొదటిసారి కాదు. 2023లోనూ జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ నుంచి బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే ఆ తర్వాత ఆ బెదిరింపులు బూటకమని తేలింది. అంతకుముందు 2005లో రామ మందిరంపై జైషే మహ్మద్ సంస్థ దాడికి పాల్పడింది. పేలుడు పదార్థాలు నింపిన జీపుతో మందిరం వద్ద విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనతో అప్పట్లో దేశ రక్షణపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా జైషే మహ్మద్ ఆడియో హెచ్చరికను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. అయోధ్యలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# జులై 7 నుంచి బోనాల వేడుకలు

- గోల్కొండలో తొలి బోనంతో ఉత్సవాలు
- సికింద్రాబాద్ బోనాలకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ నగరంలో జులై 7 నుంచి బోనాల వేడుకలు మొదలుకానున్నాయి.. గోల్కొండలోని జగదాంబికా గుడిలో తొలి బోనంతో ఉత్సవాలు ఆరంభం కానున్నాయి. హిందూ క్యాలెండర్ ప్రకారం ఆషాడంలో బోనాలు మొదలవుతాయి. ఈ సందర్భంగా మహంకాళి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు భక్తులు. అమ్మవారికి తీరొక్క నైవేద్యం సమర్పిస్తారు.

జూలై 7న ఆషాఢమాసం మొదటి ఆదివారం భాగ్యనగరంలో బోనాల సంబరం మొదలవుతుంది. గోల్గొండ శ్రీ ఎల్లమ్మ ఆలయంలో తొలి పూజా కార్యక్రమాలు వేడుకగా నిర్వహిస్తారు. ఆ తరువాత రెండో వారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల వేడుక నిర్వహిస్తారు. సికింద్రాబాద్ బోనాలకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి. ఇక్కడ రంగం కార్యక్రమాన్ని అమ్మవారి భక్తులతో పాటుగా ప్రజలంతా ఎంతో ఆసక్తిగా వింటారు. సికింద్రాబాద్ తరువాతి వారం లాల్ దర్వాజ మహంకాళి ఆలయాల్లో ప్రతి గురు, ఆదివారాలు నెల రోజుల పాటు హైదరాబాద్ నగరమంతట బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.



హైదరాబాద్లో ప్రతి ఏడాది బోనాల వేడుక 3 దశలలో జరుగుతుంది. వాటిని గోల్కొండ బోనాలు, లష్కర్ బోనాలు, ఉజ్జయినీ మహంకాళి బోనాలు అనే పేర్లతో జరుపుకుంటారు. హైదరాబాద్ లోని హరీబౌలి లో ఉన్న శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి గుడి, లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి గుడిలో బోనాల ఉత్సవాలు ముగుస్తాయి. 150 ఏళ్ల క్రితం కలరా మహమ్మారి రావడంతో తొలిసారి ఈ బోనాలు పండుగ వేడుకలు జరుపుకున్నారని చరిత్ర చెప్తుంది. మహంకాళి అమ్మవారి ఆగ్రహం కారణంగానే నాడు కలరా వ్యాపించిందని ఓ నమ్మకం. అప్పటి నుంచి అమ్మవారికి బోనాలు వేడుకలు జరుపుకుంటున్నారు.

# జమ్మూ కశ్మీర్ పాఠశాలలో జాతీయగీతం

**ముందడుగు జాతీయం:**

కేంద్ర పాలిత ప్రాంతంలోని అన్ని పాఠశాలల్లో జాతీయ గీతాన్ని ఆలపించడాన్ని జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం తప్పనిసరి చేసింది. జమ్మూ కాశ్మీర్‌లోని పాఠశాల విద్యా శాఖ అన్ని పాఠశాలలను జాతీయ గీతంతో ఉదయం అసెంబ్లీని ప్రారంభించాలని ఆదేశించింది. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూలోని అన్ని స్కూల్స్ లో ఉదయం అసెంబ్లీ ఏకరీతిగా జరపాలని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సర్క్యులర్ జారీ చేసింది. దీంతో ఇక నుంచి జమ్ము కశ్మీర్ స్కూల్ లో జనగణమణ గీతం వినిపించనుంది.



ఇలా అసెంబ్లీ జాతీయ గీతంతో పాఠశాల మొదలు పెట్టడం.. ఉదయం నిర్వహించే నైతిక సమగ్రత విలువలను పెంపొందించడంతో పాటు అసెంబ్లీ విద్యార్థుల మధ్య ఐక్యత, క్రమశిక్షణను పెంపొందిస్తుందని జమ్మూ కశ్మీర్ ప్రిన్సిపల్ సెక్రటరీ అలోక్ కుమార్ తెలిపారు. ఈ సమయంలో పాఠశాలలకు అతిథి వక్తలను ఆహ్వానించాలని, పర్యావరణంపై అవగాహన కల్పించాలని, ఉదయం జరిగే సమావేశాల్లో డ్రగ్స్‌పై అవగాహన పెంచుకోవాలని స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. మానసిక, శారీరక శ్రేయస్సుపై మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల (ఎన్‌డిపిఎస్) హానికరమైన ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి అని సర్క్యులర్ లో పేర్కొంది. మార్గదర్శకాల ప్రకారం ఉదయం అసెంబ్లీ వ్యవధి 20 నిమిషాలుగా నిర్ణయించబడింది. విద్యార్థులకు సమాజంలోని పరిస్థితులు, భిన్నమైన సంస్కృతులు, చారిత్రక విషయాలు, పర్యావరణంపై అవగాహన వంటి 16 అంశాలను పాఠశాలల్లో తప్పనిసరిగా పాటించాలని ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు.



# అందరూ చూస్తుండగానే వ్యక్తిని కొట్టి చంపారు

## పట్టపగలే పచ్చని పొలాల మధ్య దారుణం

**ముందడుగు తెలంగాణ:**

భూ తగాదా కారణంగా ఒక వ్యక్తిని అత్యంత దారుణంగా కొట్టి చంపారు. పట్టపగలే పచ్చని పొలాల మధ్య అందరూ చూస్తుండగానే ఇద్దరు వ్యక్తులు మరో వ్యక్తిని కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. కొట్టొద్దని అక్కడున్న ఓ మహిళా వేడుకున్నా వినకుండా అతడిని చితకబాదారు దాయాదులు. చాలా మంది గుమిగూడి చూస్తున్నారు తప్ప ఎవరూ ఆపలేదు. ఈ ఘటనను అక్కడున్న వారిలో ఎవరో వీడియో తీశారు. ఈ ఘటన నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామంలో జరిగింది. చిన్నపొర్ల గ్రామానికి చెందిన గువ్వల సంజప్ప (28)అనే వ్యక్తికి మరో వర్గానికి మధ్య కొంత కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో సంజప్ప అనే వ్యక్తిని మరో ఇద్దరు వ్యక్తులు పొలం దగ్గర కర్రలతో కొట్టారు. తీవ్రగాయాలైన సంజప్పను మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముందడుగు
శనివారం,
15-6-2024,
హైదరాబాద్

# ఆరేళ్ల బాలికను చిదిమేశాడు



- అర్థరాత్రి బాలికను ఎత్తుకెళ్లిన నీచుడు
- అత్యాచారం చేసి, హత్య చేసిన కామాంధుడు
- పెద్దపల్లి జిల్లాలో అత్యంత దారుణ సంఘటన

**అమ్మ పక్కన పడుకున్న ఆరేళ్ల బాలికపై ఒక దుర్మార్గుడు కన్నేశాడు. తల్లి పడుకోగానే తల్లి పక్కనే నిద్రిస్తున్న బాలికను అర్థరాత్రి పొదల్లోకి ఎత్తుకెళ్లాడు. ఆ పసి బిడ్డపై అత్యాచారం చేసి అత్యంత దారుణంగా హతమార్చిన సంఘటన తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాలో జరిగింది. బాలికను తీసుకువెళ్లిన సదరు కామాంధుడి వీడియోకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది..**

ముందడుగు కరీంనగర్

పెద్దపల్లి జిల్లాలోని ఒక రైస్ మిల్లులో పనిచేస్తున్న తల్లి తనతో పాటు బాలికను కూడా తీసుకొని వెళ్లి పని చేసుకుంటుంది. గురువారం రాత్రి తన తల్లితో కలిసి రైస్ మిల్లులో నిద్రిస్తున్న బాలికను అదే మిల్లులో డ్రైవర్ గా పనిచేస్తున్న బలరాం అనే వ్యక్తి ఎత్తుకెళ్లాడు. నిద్రిస్తున్న బాలికను తీసుకొని సమీపంలో ఉన్న పొదల్లోకి వెళ్లి అత్యాచారం చేశాడు.

### విగతజీవిగా బాలిక

ఆ తర్వాత బాలిక ఎవరికైనా చెబుతుందేమోనని భయపడి అక్కడే బాలికను హతమార్చాడు. ఆపై ఏమీ ఎరగనట్టు వచ్చేశాడు. అయితే అర్థరాత్రి సమయంలో తన పక్కన బాలిక లేదని గుర్తించిన తల్లి తోటి కార్మికులతో కలిసి చుట్టుపక్కల పరిసరాల్లో వెతికింది. అక్కడ విగతజీవిగా పడి ఉన్న బాలికను గుర్తించింది. బాలిక అత్యాచారానికి గురైంది అని గ్రహించిన తల్లి పోలీసులకు సమాచారం అందించింది.

### సిసిటీవీలో నిందితుడి దృశ్యాలు

సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా నిందితుడి గుర్తించి బాలికను ఎవరు తీసుకువెళ్లారు అన్నది సీసీటీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించిన తల్లి, నిందితుడిని పోలీసులకు అప్పగించింది. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు బాలికను తీసుకు వెళుతున్న దృశ్యాలు సిసిటీవీలో నమోదు కావడంతో నిందితుడిని గుర్తించగలిగారు.

### కఠినంగా శిక్షించాలని డిమాండ్

ఏది ఏమైనా ఆరేళ్ల పసి బాలిక పైనా దారుణ అత్యాచారానికి పాల్పడి, ఆపై ప్రాణాలు తీసిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఈ ఘటన గురించి తెలిసిన ప్రతి ఒక్కరు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పసివాళ్లను కూడా వదలకుండా అత్యాచారాలకు పాల్పడుతున్న ఇటువంటి వారిని కఠినంగా శిక్షించకుంటే ఇలాంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని వారు అంటున్నారు.

## పరిమితికి పెంచి ఏటీఎం వాడితే ఛార్జీల మోతే

### ఇంటర్‌ఛేంజ్ ఫీజు పెంచాలని నిర్ణయం

ముందడుగు జాతీయం:

ఏటిఎం అనేది ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికి సర్వ సాధారణం అయింది. బ్యాంకులో ఉన్న అకౌంట్ హోల్డర్స్ అంతా కూడా మనీ కోసం ఏటిఎం మిషన్ వద్దకు వెళ్లడం కామన్ అయింది. అయితే ఇకపై పరిమితికి మించి చేసే ట్రాన్సాక్షన్లపై చార్జీల మోత మోగనుందట.

క్యాష్ విత్‌డ్రాలపై కస్టమర్లు చెల్లించే ఇంటర్‌ఛేంజ్ ఫీజులు పెంచాలని కోరుతూ దేశంలోని ఏటీఎం ఆపరేటర్స్ ఆర్బీఐని కోరిందట. ప్రస్తుతం ఉన్న ఇంటర్‌ఛేంజ్ ఫీజు పెంచాలని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ (సీఏటీఎంఐ) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌కు సంప్రదించినట్లు తెలుస్తోంది. ఒక బ్యాంక్ ఏటీఎం కార్డును మరో బ్యాంక్ ఏటీఎంలో వినియోగించడాన్నే ఇంటర్ ఛేంజ్ అంటారు. ప్రస్తుతం దీనికి ఛార్జ్ 21 రూపాయలు ఉండగా, ఇప్పుడు




దాన్ని 23 రూపాయలు చేయాలంటూ ఏటీఎం నిర్వహణ సంస్థ కోరుతోంది. గతంలో రెండేళ్ల క్రిందట ఇంటర్‌ఛేంజ్ ఫీజు రేటును పెంచారు. మళ్లీ ఇప్పుడు ఇంకొంత ఛార్జ్ పెంచాలని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఏటీఎం ఇండస్ట్రీ అభ్యర్థిస్తోంది.

ఏటిఎం సెంటర్లలో డబ్బు రాకుండా అకౌంట్ బ్యాలెన్స్ కట్ అయితే.. దానికి కొన్ని ఆర్బీఐ రూల్స్ ఉన్నాయి. ఏటీఎం మెషీన్ స్టక్ కావడం వల్ల, లేదా ఇంటర్నెట్ స్లో ఉండటం వల్ల కొన్ని సందర్భాల్లో కస్టమర్‌కు డబ్బుల అందవు. ఇలాంటి కేసుల్లో వెంటనే సమీపంలోని సంబంధిత బ్యాంకుకు వెళ్లి సమాచారం ఇవ్వాలి. లేదా బ్యాంక్ కస్టమర్ కేర్ కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. ఆర్బీఐ నిబంధనల ప్రకారం.. కస్టమర్ ఈ ఫిర్యాదు చేసిన 5 రోజుల లోపు డబ్బులు రిటర్న్ బ్యాంకులు డబ్బు రిటర్న్ చేస్తుంది. అలా డబ్బు రిటర్న్ కానీ సందర్భంలో రిజర్వ్ బ్యాంక్ రూల్స్ ప్రకారం రోజుకు 100 రూపాయల చొప్పున కస్టమర్‌కు బ్యాంక్ జరిమానా చెల్లిస్తుంది.

విక్స్‌కు సంబంధించిన అతి పెద్ద వార్తను ప్రకటించిన

## పవర్‌హౌస్ రణ్‌వీర్ సింగ్




ముందడుగు హైదరాబాద్:

పవర్‌హౌస్ బ్రాండ్ అంబాసిడర్ రణవీర్ సింగ్ నేడు, విక్స్‌కు సంబంధించిన 'అతి పెద్ద వార్త' 'విక్స్ మాత్ర ఇప్పుడు మరింత పెద్దదైంది' అని ప్రకటించి, రెండు దశాబ్దాల అనంతరం ఐకానిక్ త్రిభుజాకార విక్స్ కాఫ్ డ్రాప్స్ మొట్టమొదటి డబుల్ పవర్డ్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను ఆవిష్కరించారు. సాహిల్ సేథీ, కేటగిరీ లీడర్, కన్స్యూమర్ హెల్త్‌కేర్, P&G ఇండియా మాట్లాడుతూ, "విక్స్ మాత్రతో ఖిచ్ ఖిచ్‌ను దూరం చేసుకోండి' అనే విక్స్ కాఫ్ డ్రాప్స్ ఐకానిక్ బ్రాండ్ జింగిల్ ప్రతి ఒక్కరికీ సుపరిచితమే. ఖిచ్ ఖిచ్ రహిత స్వరంలో మాట్లాడేందుకు 1960 నుంచి భారతీయులకు సహాయపడిన వ్యామోహాన్ని తక్షణమే కలిగిస్తుంది. మా వినియోగదారులకు ఏమి కావాలో ఎల్లప్పుడూ వారి అభిప్రాయాలను వినడం ద్వారా, మా ఉత్పత్తి సూత్రీకరణలు మరియు ప్యాకేజింగ్‌లో ఈ అభిప్రాయాలను పొందుపరచడం ద్వారా ఈ వారసత్వాన్ని పెంపొందించుకునేందుకు ఉన్నామని అన్నారు.

ముందడుగు
శనివారం, 15-6-2024, హైదరాబాద్

# BEST OF WEB GLAMOUR PICS


Tanya Chaudhari


Neha Malik


Tanya Chowdary's


## విజయ్ దేవరకొండ నయా అవతార్..



హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా అభిమానులకు వినోదాన్ని అందించడమే టార్గెట్‌గా ముందుకెళ్తున్నాడు విజయ్ దేవరకొండ. రౌడీ బాయ్ ఇటీవలే అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) ఉమెన్స్ ఫోరం ఈవెంట్‌కు హాజరయ్యాడని తెలిసిందే. అక్కడి తెలుగు మహిళలు విజయ్ దేవరకొండకు ఘనంగా స్వాగతం పలికిన వీడియో ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా విజయ్ దేవరకొండ అట్లాంటాలో జరుగుతున్న 18వ ATA Convention and Youth Conference కోసం ప్రత్యేకంగా రెడీ అయ్యాడు. సంప్రదాయ, మోడ్రన్ అవతార్‌లో కింగ్ లుక్‌లో మెరిసిపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చాడు. ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. లైగర్ భారీ డిజాస్టర్ తర్వాత సినిమాల ఎంపికలో రూటు మార్చిన విజయ్ దేవరకొండ శివనిర్వాణ డైరెక్షన్‌లో నటించిన ఖుషి మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. ఇక ఇటీవలే పరశురాం డైరెక్షన్‌లో వచ్చిన ఫ్యామిలీ స్టార్ ఢీలా పడిపోయింది. ప్రస్తుతం VD12, VD13, VD14 సినిమాలతో బిజీగా ఉన్నాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న కాప్ డ్రామా VD12 షూటింగ్ దశలో ఉంది.

## నెట్టింట కపుల్ సాంగ్ సూసేకి ఫీవర్..

### పుష్ప ది రూల్ పాట అరుదైన ఫీట్



పాన్ ఇండియా, గ్లోబల్ మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న టాలీవుడ్ సినిమా పుష్ప ది రూల్. సుకుమార్ దర్శకత్వంలో పుష్ప ఫ్రాంఛైజీలో వస్తున్న సీక్వెల్‌లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కాగా రీసెంట్‌గా ఈ మూవీ నుంచి కపుల్ సాంగ్ సూసేకి సాంగ్‌ను లాంఛ్ చేశారని తెలిసిందే. ఈ పాటను తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో లాంఛ్ చేయగా.. నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ పాట యూట్యూబ్‌లో 100 మిలియన్లకుపైగా వ్యూస్, 1.67 మిలియన్లకుపైగా లైక్స్‌లో నంబర్ వన్ స్థానంలో ట్రెండింగ్‌లో నిలిచింది. కపుల్ సాంగ్ వైబ్‌కు ఫిదా అయిపోతున్న మూవీ అండ్ మ్యూజిక్ లవర్స్ ఇప్పటికే నెట్టింట రీల్స్ చేస్తున్నారు. మరోవైపు ఫస్ట్ సింగిల్ పుష్ప పుష్ప సాంగ్ కూడా నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. మొత్తానికి విడుదలకు ముందే పుష్ప ది రూల్ మరో మ్యూజికల్ హిట్‌గా నిలిచిపోవడం పక్కా అయిపోయినట్టేనని తాజా అప్‌డేట్స్ చెబుతున్నాయి. పుష్ప ది రూల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.